

# చోంగా బుత్తీ షక్కర్ షర్బత్

చోంగా అంటే చక్కెర అప్పడం. బుత్తీ అంటే పెరుగన్నం. షక్కర్ అంటే చక్కెర.

పీర్ల పండగ (మొహర్రం) వచ్చిందంటే ఈ నాలుగూ కంపల్సరీ మా యిళ్లల్లో. చోంగా బుత్తీ షర్బత్- యింట్లో తినడానికి. షక్కర్- పీర్ల సావిట్లో 'ఫాతేహా' (సదివింపులు) యివ్వడానికి.

మా యింట్లో బిడ్డ పుట్టినా మనిషి పోయినా పండగొచ్చినా పలావు దబర పొయ్యిమీదకెక్కద్దని అనుకుంటా వుంటారుకదా, పీర్ల పండక్కి మాత్రం ఆ లెక్కేమీలా.

ఈ పండగను షహీదైన మా హసేను, హుసేనులను గుర్తు చేసుకునేదానికి

చేసుకుంటామ కాబట్టి మావుసం అనే మాటే యింట్లోకి రాదు. అట్నే కొత్త గుడ్డలు కూడా కుట్టించుకోము. రంజానుకీ, బక్రీదుకీ యీద్గాకు వెళ్లి నమాజు చేసినట్టుగా యీ పండక్కి నమాజు చేయము. చోంగా బుత్తీలు చేసుకొని గమ్మున ఉండిపోతాము.

అట్టాగని యీ పండక్కి కళేమీ లేదని కాదు.

అసలికి కళంతా వుండేది యీ పండగలోనే- పీర్ల సావిడి కాడ. విష్ణాలయం వీదిలోని పీర్ల సావిడిలో పీర్లను కూచోపెట్టినప్పటి నుంచి సాయింత్రమయ్యిందంటే చాలు పిలకాయలమందరం ఆణ్ణే చేరే వాళ్లం. ఒక తట్టు 'కుందుడు గుమ్మ', 'చీర్' ఆట ఆడుకుంటానే యింకోతట్టు ఎవురెవురు వచ్చి ఫాతేహా చేయిస్తా వున్నారా అని గమనించుకుంటా వుండేవాళ్లం. ఎందుకనంటే సాయిబులైనా హిందువులైనా పీర్లసావిడికొచ్చి ఫాతేహా చేయించినారంటే ప్రసాదంలో సగం మాకు పంచి, తక్కింది యిళ్లకి తీసుకెళ్లేవాళ్లు. చక్కెర, బెల్లం, కజ్జూరం, బూందీ- ఒకోరు ఒకోటి.

సావిట్లో పీర్లను కూచోబెట్టే పది రోజుల ముందర నుంచే పీర్ల సాయిబు చందా పుస్తకం తీసుకొని బయలుదేరతాడు చందాల కోసరం. తెల్లగా, ఎత్తుగా యింత పొడుగు గెడ్డంతో వుండే ఆ ముసలాయన్ని చూడగానే ఒట్టి సాయిబులే కాకుండా హిందువులు కూడా గమ్మున చదివించేవాళ్లు చందా. మా నాయినయితే యిర్వై రూపాయలు యిచ్చేవాడు టంచనుగా.

చందా డబ్బులు వసూలయ్యేకొద్దీ పీర్ల సావిడికి కళ. సున్నాలు కొట్టించడం, పీర్లకు ఆకుపచ్చంగుండే జలతారు గుడ్డలు తీసకరావడం, మల్లెదండలు చుట్టపెట్టడం, లైట్లు, సీరియల్ సెట్లు, సాంబ్రాణీ కడ్డీలు, వూదు...

మా పీర్ల సావిట్లోకి తొంగిచూస్తే పీర్లన్నీ వరుసగా, ప్రాణం పోసుకున్న మనుషుల్లాగా అవుపించి మా పిలకాయలందరికీ బలే బయాన్నీ బక్తినీ కలిగించేవి. పీర్ల నడిమద్యన ఉండే 'హుసేన్‌సా' పీరును చూసినామంటే అందరికీ హడలు. యిత్తడి రేకుతో, గుండ్రంగా, చాటంత వెడల్పు వుండి నెత్తిన రెండు కొమ్ములతో బీకరంగా వుండేదా పీరు. యమా యమా పయిల్వానులకి మాత్రమే ఆ పీరు వంట్లోకొస్తుందని చెప్తా వుంటారు. వూరేగింపులో దాన్ని మోసేవాళ్లు కూడా బలే స్ట్రాంగుగా వుండేవాళ్లు.

పీర్ల పండగ వచ్చిన ప్రతీసారీ మా యిళ్లల్లో మా కరీముల్లా మామే (మా అమ్మ పెదతమ్ముడు) హీరో. మా యిళ్లల్లో ఆయన తప్ప యింకెవ్వురూ గుండం తొక్కరు- బయుం వల్ల. మా అమ్మ తట్టు బందువుల్లోనే నజీర్ మామా, బషీర్ మామాలాంటోళ్లు గుండం తొక్కేవాళ్లుగానీ మా నాయిన తట్టు బందువుల్లో ఒక్కరూ గుండం తొక్కేవాళ్లు కాదు. మా నాయినైతే జన్మలో ఒకసారి కూడా గుండం తొక్కలేదంట!

మా వూర్లో పీర్లు కూచోబెట్టిన ఏడో రోజున, తొమ్మిదోరోజున వరసగా రెండు రోజులు తొక్కతారు గుండాన్ని. ఆ రెండు రోజులూ విష్ణాలయం వీదికి బలే కళ. పీర్ల సావిటి ఎదురుగా సాయింత్రానికి ముందరే గుండం తవ్వి, అందులో పెద్ద పెద్ద ఎండు మొద్దులు తీసకొచ్చి పడేసేవాళ్లు. వాటి మీద కిరసనాయిలు పోసి అంటించినాక అవి కాలీ కాలీ రాత్రి తొమ్మిదిన్నరా పదికంతా ఎర్రెర్రెటి నిప్పులయిపోతాయి. అప్పుడిక పీర్ల సాయిబు వచ్చి పెద్ద కర్ర పట్టుకొని నిప్పులన్నింటినీ సదరంగా గుండం అంతా పరుచుకునేలా చేస్తాడు. యింక తొక్కడానికి గుండం రెడీ అన్న మాట.

అప్పటికి అన్నాలు తినే టయిము కూడా అయిపోయి వుంటుంది కాబట్టి పిలకాయలు, ఆడోళ్లు, మొగోళ్లు అందరూ గుండం దగ్గరికి చేరేవాళ్లు గుండం తొక్కేది చూడటానికి.

కాసేపటికి ఊళ్లోకెళ్లిన పీర్లన్నీ తప్పెట్ల మోతతో గుండం కాడికి చేరుకునేవి. మా కరీముల్లా మామతో సహా పీర్లు మోస్తా వున్న పెద్దోళ్లంతా అదోరకమైన పూనకంతో వూగతా ఉండేవాళ్లు. వాళ్ల ఒంటి మీద బనీను, గోసిపాత తప్పితే యింకేమీ వుండేవి కావు. మా అమమ్మ, మా తాత అటోపక్క యిటో పక్క నిలబడి మా కరీముల్లా మామను కంట్రోలు చేస్తా వుండేవాళ్లు. గుండం తొక్కబోయే వాళ్లందరి మీదా బిందెడేసి నీళ్లు కుమ్మరించేవాళ్లు ఎవరో ఒకరు.

అప్పుడింక తప్పెట్ల మోత యింకాస్త పెచ్చు పెరిగేది. అందరం కళ్లు యింతింత చేసుకొని, మొకానికి సెగ తగలతా వున్నా, గుండానికి యింకాస్త దగ్గరగా వచ్చేసేవాళ్లం.

పస్టు పీరుని పీర్ల సాయిబు బుజానికెత్తుకొని 'దీన్' అని పెద్దగా రంకెవేసేవాడు ఊగతా. ఆ రంకెకి ఆయన్తోపాటు అందరం 'దీన్... దీన్'మని పెద్దగా కేకలేసే వాళ్లం.

పీర్ల సాయిబు గుండంలోకి ఒక ఊపుగా దిగేవాడు. ఆయన వెనకనే పీర్లు పట్టుకున్న వాళ్లంతా పెద్ద పెద్ద అంగలతో గుండంలోకి అడుగుపెట్టేవాళ్లు. ఆ పక్క నుంచి యీ పక్కకి, యీ పక్క నుంచి ఆ పక్కకి వాళ్లు మూడు చుట్లు తిరుగుతున్నంత సేపూ 'దీన్ దీన్'మంటా అరస్తానే వుండేవాళ్లము మేము.

పీర్లు కూచోబెట్టిన పదో రోజు షహాదత్.

ఆ రోజు గుండం తొక్కేది వుండదు. ఊరేగింపు. జల్సా.

ఎద్దల బండికి రంగు కాయితాలతో డెకరేషను చేసి పీర్లన్నింటినీ బండెక్కిస్తాడు పీర్ల సాయిబు. తప్పెట్లు కొట్టే మాదిగోళ్లతో వాళ్ల దరువుతో సరిసమానంగా డ్యాన్సాడే పులేషగాళ్లతో ఊరేగింపు బయలుదేరేది. నల్లటి మసి పూసుకొని, యింతింత పెద్ద గుడ్డ

రొమ్ములు పెట్టుకొని, ఒక చేతిలో పాత చాట, యింకో చేతిలో పాత చీపిరి పట్టుకొని రాకాసి ఆడామె వేషంలో అందర్నీ తన్నే మీరాసాయిబు పిలకాయలనీ ఆడోళ్లని బలే నవ్వించేవాడు. ప్లూటూ డ్రమ్మూ మీద డ్రయివరు రాముడు, యమగోల పాటలేసే యానాదోళ్ల ఆటకైతే జనం విరగబడేవాళ్లు.

ఊరేగింపు ఒకో వీదిలో అడుగు పెడతా వుంటే బిందెలతో నీళ్లు కుమ్మరించి స్వాగతం చెప్తా వుంటారంతా. పెద్దోళ్లు పానకం, చక్కెర తీసకెళ్లి 'ఫాతేహా' చేయిస్తా వుంటే పిలకాయలం పులేషం కాడ చేరేవాళ్లం. మా ఊర్లో రసూల్ సాయిబు అనే ఆయన పులేషం కట్టినాడంటే అదిరిపోవాల్సిందే. నల్లగా యింతపొడుగున అమితాబ్‌బచను హిప్పీక్రాపుతో వుండేవాడాయన. నోటిలో నిమ్మకాయ పెట్టి, వెనక మోకులేసి కట్టి ఆయన చేత పులేషం వేయించేవాళ్లు.

రాత్రంతా పులేషాలతో యానాదోళ్ల పాటలతో అన్నీ వీదులూ తిరిగినాక తెల్లారేపాటికి పాపిరెడ్డి చెరువుకాడికి చేరతాయి పీర్లు. వాటితో పాటు వూరేగిన వాళ్లంతా అసిలిపోయి చెరువు కట్ట మీద వాలిపోతారు కాసేపు. పీర్లసాయిబొచ్చి పీర్లన్నింటినీ చెరువులో ముంచడంతో పీర్ల పండగ ముగిసేది. ఆ తర్వాత పీర్లన్ని చెక్క పెట్టెలో చేరి పీర్ల సావిట్లోని అటక మీదకెక్కేవి.

అంతదాకా అన్ని పనులూ దగ్గరండి చేసిన పీర్ల సాయిబు సావిటికి తాళం వేసి మళ్లా పనుల్లోకి పడేవాడు.

సావిడి బోసి పోయేది. సున్నం వెలిసి పోయేది.

ఆ దారిన పోయినప్పుడల్లా మళ్లా పీర్ల పండగ ఎప్పుడొస్తుందా అని పిలకాయలందరం ఎదురుచూస్తా వుండేవాళ్లం- ఫాతెహా చక్కెర తినేదానికి, పీర్ల సావిడి ముందు గోలగా. ఆడుకునేదానికి.

(నేను యిప్పటి దాకా చెప్పిన కతంతా నేను పుట్టక ముందుదీ నేను పుట్టినాక ఎనిమిదో కిలాసు వరకూ జరిగినదీ. నేను ఎనిమిదో కిలాసులో వుండగా పాపం పీర్ల సాయిబు చనిపోయినాడు. ఆయన ఒంట్లో ప్రాణం వున్నంత కాలం బతిమాలో, ఒప్పించో అందరికాడా చందాలు వసూలు చేసి గనంగా చేసేవాడు పీర్ల పండగ. ఆయన పోయినాక ఆయన తరుపోళ్లు చేస్తా ఉన్నారుకానీ యిప్పొడొక కళా లా. కాంతీ లా. మొద్దులు కాల్చేది లా. గుండం తొక్కేది లా. అంతా మొక్కుబడి తంతే. మా ఊర్లో పీర్ల గుండం తొక్కి యిప్పటికి పదిహేనేళ్లు కావస్తా వుందంటే మా వూరి సాయిబులు కళాకాంతులు లాకుండా ఎట్టా తయారవతా వున్నారేమిరా అని బలే బాదగా అనిపిస్తా వుంటుంది నాకు.).